# దసరా పద్యములు

దసరా సమయములో పాఠశాల అధ్యాపకులు విద్యార్థులను ఇంటింటికి త్రిప్పుతూ, పద్యాలు పాడిస్తూ, శుభాకాంక్షలు తెలిపే ఆనవాయితీ ఉండేది. నేడు అది గగన కుసుమమైనా, వాటిని తలచుకుంటే వర్ణణాతీతమైన అనుభూతి కలుగుతుంది. ఇలా ఇంటింటికి తిరుగుతూ పద్యాలు పాడడం వలన ఇతిహాసాలకు సంబంధించిన విజ్ఞానము, లోకజ్ఞానము, బిడియము పోయి - ధైర్యముగా నలుగురిలో మాట్లాడ గలిగే గుణములు అలవడడానికి తోడ్పడేవి. రానున్న దసరా పండుగ సందర్భముగా ఒక పద్యాన్ని మీకు జ్ఞప్తికి తెప్పించే ప్రయత్నము చేస్తున్నాము.

శ్రీరాములానతిని జలధియేతెంచి
ననాంగునినిగాచి లంకకేతెంచి
లంకిణిని చెండాడి లంకంత వెదికి
పంకజాణన సీత పరికించి గాంచి
ముద్రిక కానుకా ముదమొప్పగాంచి
భద్రంబుగా దాచి పండొక్కటడగి
వనమెల్ల పెకలించి వనధిలో వెలసి
అక్షయకుమారుని హతముగావించి
ధనుజేంద్రతో నీవు తగు ముచ్చటించి
అపురూపు లంకనగ్నిని చర కాల్చివేసి
సహజాత కన్యకను సంబ్రమున గాంచి
ఆనతి గైకొని జలధి లంఘించి
రామునకు ఈ వార్త చేరవైచితివి

జయవిజయీభవ దిగ్విజయీభవ (2)

కుడుములు ఉండ్రాళ్ళు పాయసాన్నములు
తగు ఫలంబులు నీకు నైవేద్యమయ్యా
శ్రీరామ జయరామ జయజయ రామ (2)
(చేతబూనిన ధనుర్భాణాలతో, మూడు సార్లు పువ్వులను నింపి ఇంటిలోకి సంధిస్తారు)

(తరువాత సంభావన ఇలా అడుగుతారు)
అయ్యవారికి చాలు ఐదు వరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పు బెల్లాలు

(తగిన విధంగా సంభావన ముట్టకపోతే ...)
ఏదయా మీదయా మామీద లేదు
ఇంత నిర్లక్ష్యమా ఇది మీకు తగదు
అయ్యవారికి చాలు ఐదు వరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పు బెల్లాలు

పావళా ఇస్తేను పట్టేది లేదు
అర్ధ రూపాయిస్తే అంటేదిలేదు
ముప్పావళా ఇస్తే ముట్టేది లేదు
ఇచ్చు రూపాయిస్తే పుచ్చుకుంటాము

(విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీమతి. రామలక్ష్మి గారికి కృతజ్ఞతలతో)